క్లుప్తంగా

ఎమ్మెల్సీకి సన్మానం


ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న కౌన్సిలర్ నర్సింలుగౌడ్

కొత్తూరు: ఇటీవల మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందిన బీఆర్‌ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డిని సోమవారం మున్సిపాలిటీ కౌన్సిలర్ మాదారం నర్సింలుగౌడ్ ఆయన స్వగ్రామంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నర్సింలుగౌడ్ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజల్లో మంచి ఆదరణ వస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తమకు సూచించినట్లు తెలిపారు. ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయ మన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో చాలావరకు ఆదరణ తగ్గిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమని కౌన్సిలర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, గోపాల్‌గౌడ్, నర్సింహా పాల్గొన్నారు.

కొనసాగుతున్న మిషన్ భగీరథపై సర్వే


సర్వే నిర్వహిస్తున్న మండల అభివృద్ధి అధికారి సంధ్య, తదితరులు

మొయినాబాద్‌రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో మిషన్ భగీరథపై సర్వే కార్యక్రమాన్ని అధికారులు వేగవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారి సంధ్య అన్నారు. సోమవారం సెలవు దినం అయినా మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో అధికారులు నిర్వహించిన మిషన్ భగీరథపై సర్వే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని అధికారులు వేగవంతం చేసి త్వరలో పూర్తి చేయాలని సూచించారు. హిమాయత్‌నగర్ గ్రామంలో అధికారుల పనితీరు వేగవంతం చేయాలన్నారు. పరిశీలించిన నివేదికను వెంటనే అందించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హిమాయత్‌నగర్ పంచాయతీ కార్యదర్శి సంధ్య, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేయిస్తున్న లక్ష్మణ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: రక్తదానం.. ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే యువసత్తా యూత్ లక్ష్యమని యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పట్టణానికి చెందిన శ్రీనివాస్ కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో మాదాపూర్ ప్రేమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ నిమిత్తం శ్రీనివాస్‌కు రక్తం అవసరమని వైద్యులు తెలిపారు. సోమవారం బాధితుడి కుటుంబ సభ్యులు యువసత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్‌ను సంప్రదించారు. వెంటనే స్పందించిన లక్ష్మణ్‌కుమార్ ఆస్పత్రికి చేరుకొని మ్యాడం నరేశ్, శ్రీకాంత్, నరేశ్, అఖిల్ సహకారంతో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతినిత్యం ఎంతో మంది అత్యవసర సమయంలో రక్తం దొరకకపోవడంతో తమ ప్రాణాలను కోల్పోతున్నారని, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. రక్తదానంపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ప్రతి మూడు నెలలకొకసారి రక్తాన్ని దానం చేయొచ్చన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి శ్రీనివాస్ కుటుంబసభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


చేవెళ్ల: ఆలూరులో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


షాబాద్: బోడంపహాడ్‌లో..


కొందుర్గు: చౌదరిగూడలో పండగ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు


షాబాద్: పోతుగల్‌లో..


చేవెళ్ల: మల్కాపూర్‌లో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో సోమవారం బక్రీద్ పండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఈద్గాలు, మజీద్‌ల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం అలాయ్ బలాయ్ తీసుకొని ఒకరికొకరూ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లిం మత గురువులు భక్తులకు దైవ సందేశం ఇచ్చారు. ముస్లింలు చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా పెద్దఎత్తున తరలివచ్చి ప్రార్థనల్లో పాల్గొనడంతో మజీద్‌ల వద్ద సందడి నెలకొంది. భక్తికి, త్యాగానికి ఈ పండగ ప్రతీకగా నిలుస్తోందని పలువురు పేర్కొన్నారు. ముస్లింలకు ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్త్ నిర్వహించారు. ఫరూఖ్‌నగర్‌లో ఈద్గా వద్ద ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు.


షాబాద్: నాగర్‌గూడలో పండగ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు


కేశంపేట: నిర్దవెళ్లిలో..


మొయినాబాద్‌రూరల్: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకుడు నర్సింహ్మా


మొయినాబాద్: సురంగల్‌లో..


షాద్‌నగర్‌రూరల్: ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


షాద్‌నగర్‌రూరల్: పండగ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

మొయినాబాద్‌లో భారీ వర్షం


మొయినాబాద్‌లో రోడ్లపై పారుతున్న వర్షం నీరు

మొయినాబాద్: మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు సురంగల్, పెద్దమంగళారం, చిలుకూరు, అప్పోజీగూడ, చందానగర్, రెడ్డిపల్లి, మోత్కుపల్లి, కుత్బుద్దీన్‌గూడ, ఎలుకగూడ, మేడిపల్లి తదితర గ్రామాల్లో భారీగా వర్షం పడింది. సుమారు అరగంటకుపైగా వర్షం కురవడంతో మండల కేంద్రంలో రోడ్లపై వరదలు పారాయి. రోడ్లు జలమయంకావడంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. మొయినాబాద్‌లో సంత ఉండటంతో వర్షం కారణంగా చిరువ్యాపారులు ఇబ్బందిపడ్డారు.

సారా తయారు చేస్తే కఠిన చర్యలు

ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్

ఆమనగల్లు: నాటుసారాను తయారు చేసినా, విక్రయించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్ హెచ్చరించారు. ఆమనగల్లు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు గుడుంబా రహిత తెలంగాణ కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల్లో నాటుసారా నివారణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల ఆయా మండలాల్లో దాడులు నిర్వహించి నాటుసారా విక్రయిస్తున్న వారిని అరెస్టు చేశామని తెలిపారు. అదేవిధంగా పలు తండాల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు వివరించారు. పట్టుబడిన వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. నల్లబెల్లం, నవసాగ్రం, పటికలను విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. పట్టణంతో పాటు పలు గ్రామాల్లోని కిరాణా షాపుల్లో బెల్లం విక్రయాలు జరగకుండా చర్యలు చేపట్టామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి బెల్లం నేరుగా తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందని, వారిని గుర్తించి కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని వెల్లడించారు.

20న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

ఆమనగల్లు: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 20న 1 నుంచి 19 ఏళ్ల వయసులోపు పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డా.పరీక్షిత్ నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లో పంపిణీ చేస్తామని తెలిపారు. బడికి వెళ్లని వారికి కూడా మాత్రలు అందిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ నులిపురుగుల నివారణ మాత్రలను తీసుకోవాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఇబ్రహీంపట్నం: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని మంగళవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటనర్సప్ప ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిపో పరిసర ప్రాంతాల్లోని ప్రజలు తమ సలహాలు, సూచనలు, సమస్యలు డయల్ యువర్ డీఎం కార్యక్రమం ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని డిపో అభివృద్ధికి సహకరించాలని విన్నవించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- వందపడకల ఆస్పత్రికి రూ.17కోట్ల నిధులు మంజూరు


చేవెళ్ల: పేద ప్రజలకు అందుబాటులో ఉండే ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలోని దయాలసిస్ కేంద్రంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న ఆయన సోమవారం ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డయాలసిస్ వార్డును పరిశీలించారు. అక్కడే ఉన్న వైద్యులను ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం డయాలసిస్ కేంద్రంలో సమస్య పరిష్కరించి పేషెంట్లకు డయాలసిస్ సేవలు కొనసాగుతున్నాయని ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ సోమశేఖర్ ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఇలాంటి సంఘటనలు మరోసారి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన చెప్పారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రిలో రోగులకు గదులు సరిపోవటం లేదని వైద్యులు చెప్పారు. దీంతో ఆయన చేవెళ్ల ఆస్పత్రిని వందపడకల ఆస్పత్రిగా మార్చేందుకు గతంలోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 17కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో చేవెళ్లలోని ప్రభుత్వ ఆస్పత్రిని అన్ని రకాల వైద్యసదుపాయాలతో నిర్మాణం చేసేందుకు కృషి చేస్తానన్నారు. వందపడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి మండల కేంద్రంలోని అనువైన ప్రభుత్వ భూమిని గుర్తించి అక్కడ ఆసుపత్రి నిర్మాణం చేయాలనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట వైద్య సిబ్బంది, నాయకులు ఉన్నారు.


దయాలసిస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న టెస్కాబ్ వైస్ చైర్మన్ సత్తయ్య

తుర్కయంజాల్: టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య సోమవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. తనకు టెస్కాబ్ వైస్ చైర్మన్ పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నాయకులు అశోక్‌గౌడ్, శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సేంద్రియం.. ప్రయోజనకరం

- జీవన ఎరువుల వాడకంతో పర్యావరణం, ఆరోగ్యానికి ఉపయోగం
- తగ్గనున్న పెట్టుబడి ఖర్చు
- పెరుగనున్న భూసారం, పంట దిగుబడి అధికం



మొయినాబాద్: కొన్నేళ్లుగా అధిక దిగుబడి కోసం రైతులు విచక్షణా రహితంగా రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడుతున్నారు. ఫలితంగా భూసారం దెబ్బతింటోంది. పర్యావరణం సైతం కలుషితమై ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ సమస్యలకు పరిష్కారం సేంద్రియ ఎరువులు వాడడమేనని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పర్యావరణాన్ని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు నాణ్యమైన పంటలు పండించేందుకు సేంద్రియ వ్యవసాయం ఉపయోగపడుతుంది. సేంద్రియ వ్యవసాయ విధానంపై మొయినాబాద్ మండల వ్యవసాయ అధికారిణి రాగమ్మ రైతుల కోసం ఇచ్చిన సలహాలు, సూచనలు ఇలా ఉన్నాయి..

నేలను సంరక్షించుట

నేలపై పైరు వ్యర్థాలను కప్పడం ద్వారా నేలను సూర్యరశ్మి, గాలి, వర్షపు నీటి కోత నుంచి ఎటువంటి ఆర్థిక నష్టం లేకుండా సంరక్షించుకోవచ్చు.

అవసరం మేరకే దుక్కి దున్నుట

అధిక లోతుగా దుక్కి చేయడంతో నేల కోతకు గురవుతుంది. దీంతోపాటు నేలలోని సూక్ష్మజీవుల సంఖ్య బాగా తగ్గిపోతుంది. కావున అవసరమైనంత మేరకే లోతు దుక్కులు దున్నాలి.

మిశ్రమ పంటలు సాగుచేయుట

సేంద్రీయ వ్యవసాయంలో మిశ్రమ, అంతర పంటలు సాగు చేసుకోవాలి. వివిధ పంట మొక్కలు భూమిలోని వేర్వేరు లోతుల నుంచి వాటికి కావాల్సిన పోషక పదార్థాలను గ్రహిస్తాయి. మిశ్రమ పంటలు సాగు చేయడంతో పురుగుల తాకిడిని తగ్గించుకోవచ్చు.


కేతిరెడ్డిపల్లిలో పోర్టబుల్ వర్మిబెడ్‌లో కంపోస్టు ఎరువులు తయారు చేస్తున్న రైతులు

పంటమార్పిడి పద్ధతి

నేలను ఆరోగ్యంగా ఉంచడం, సూక్ష్మజీవులు సహజ సిద్ధంగా పని చేయడంలో పంట మార్పిడి పద్ధతి ప్రముఖ పాత్ర వహిస్తుంది. వివిధ రకాల పంట మా ర్పిడి పద్ధతులను ప్రాంతాల వారీగా చేసుకోవచ్చు. ప్రతీ సారి ఒకే రకమైన పంటలు సాగుచేయొద్దు.

సేంద్రియ, జీవన ఎరువుల వాడకం

సేంద్రియ వ్యవసాయంలో మల్చింగ్, పచ్చిరొట్ట పైర్లు, కంపోస్టు ఎరువులు, జీవన ఎరువులు వాడాలి. వీటిలో కంపోస్టు ఎరువులు, పచ్చిరొట్ట పైర్లు ముఖ్యమైనవి.

పచ్చిరొట్ట ఎరువులు

జీలుగు, జనుములు మొదలగు అధిక జీవ పదార్థాలు ఉన్న మొక్కలను పొలంలో పెంచి, భూమిలో కలియదున్నాలి. దీంతో నేల భౌతిక స్వభావం, నేలసారం వృద్ధి చెందుతుంది. నేలలో సూక్ష్మజీవుల వృద్ధికి, మొక్కలకు అవసరమైన పోషకాల లభ్యతకు ఉపయోగకరంగా ఉంటుంది. పంటల అధిక దిగుబడికి దోహదం చేస్తుంది. నీటిని ఎక్కువ రోజులు నిల్వ చేసుకునే సామర్థ్యాన్ని నేలకు ఆపాదిస్తుంది.

కంపోస్టు ఎరువులు

సేంద్రీయ వ్యవసాయంలో పూర్తిగా వర్మీకంపోస్టు ఎరువులే వాడాలి. రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకూడదు. పశువుల పేడ, ఎండిన ఆకులు, వానపాములతో వర్మీకంపోస్టు ఎరువును రైతులు తయారు చేసుకొని వాడొచ్చు. వర్మీకంపోస్టు ఎరువుల తయారీ గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

తలకొండపల్లి: మిర్యాల శ్రీను కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బోల యాదగిరి అన్నారు. మండల కేంద్రానికి చెందిన మిర్యాల శ్రీను ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి వెల్దండ ఎన్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం యాదగిరి ఆస్పత్రికి వెళ్లి శ్రీను ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి అందజేసిన రూ.5వేలను శ్రీను కుటుంబసభ్యులకు ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్‌యాదవ్, అజీం, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ ఆస్పత్రికి వెళ్లి శ్రీనును పరామర్శించి, రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట మాజీ ఉపసర్పంచ్ అనిల్, తదితరులు ఉన్నారు.


శ్రీనును పరామర్శిస్తున్న నాయకులు